క్లుప్తంగా

నేటి నుంచి పీర్ల మహోత్సవాలు

వేంపల్లె : పట్టణ పరిధిలోని చింతలమడుగుపల్లి గ్రామంలో నేటి నుంచి 17వ తేదీ వరకు పీర్ల పండుగ మహోత్సవాలు ఉంటాయని కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈనెల 15న చిన్న సరిగెత్తు, 16న విడిదినం, 17న పెద్ద సరిగెత్తు, అదేరోజు రాత్రి అగ్నిగుండం ప్రవేశం, ఆర్కేస్ట్రా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 18వ తేదీన మేళ వాయిద్యాలు, కనక తప్పెట్లతో స్వామి వారి ఊరేగింపు ఉత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ముద్దనూరులో జోరుగా జూదం

ముద్దనూరు : ముద్దనూరులో గత కొద్దిరోజుల నుంచి జోరుగా జూదం సాగుతోంది. స్థానిక తాడిపత్రి రహదారిలో 3 ప్రాంతాల్లో పేకాట నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పట్టపగలు ప్రధాన రహదారిలో మంగతాయి జూదం నిర్వహణసాగుతున్నా పోలీసులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. రెండురోజులనుంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు మంగతాయి జూదం నిర్వహించినట్లు సమాచారం. మండలకేంద్రంతో పాటు మరో చోట కూడా పేకాట జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నేడు రవాణాశాఖ మంత్రి రాక

పులివెందుల రూరల్‌ : ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌ రెడ్డి బుధవారం పులివెందులకు రానున్నారు. పట్టణంలోని వైఎస్సార్‌ హాకీ క్రీడా మైదానంలో సౌత్‌జోన్‌ క్రీడా పోటీలను ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరవుతున్నారు. ఆయనతో పాటు కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఇతర రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నారు.

ఆధార్‌ కేంద్రాలను ఏర్పాటు చేయాలి



పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

జమ్మలమడుగు : పట్టణంలో ఆధార్‌ కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి వెంటనే ఆధార్‌ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్‌ కోరారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని పరిపాలనాధికారి వెంకటలక్ష్మీకి వినతి పత్రం అందజేశారు. గతంలో పోస్టాఫీసు, స్టేట్‌ బ్యాంకులో ఆధార్‌ కార్డు సెంటర్‌లు ఉండేవి. ప్రస్తుతం ఈ కేంద్రాలను మూసివేశారన్నారు. అధికారులు వీలైనంత త్వరగా ఆధార్‌ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చెన్నూరు : మండల అభివృద్ధి సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10:30 గంటలకు మండల సభా భవనంలో ఎంపీపీ చీర్ల సురేష్‌ యాదవ్‌ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం శర్మ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి హాజరవుతున్నారని మండల అధికారులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

హెల్మెట్‌ ధరించండి

కడప ఎడ్యుకేషన్‌ : ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా ఐఎస్‌ఐ మార్కు గల హెల్మెట్‌ను ధరించి ప్రమాదాలను నివారించాలని అసిస్టెంట్‌ లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ మనోహర్‌ పేర్కొన్నారు. కడపలోని ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాలలో మంగళవారం రక్షిత హెల్మెట్‌ ఉపయోగించడంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సురక్షితంగా గమ్యాన్ని చేరాలంటే ఖచ్చితంగా హెల్మెట్‌ ధరించాలన్నారు. వాహనదారుడు తమ ప్రాణాలనే కాకుండా కుటుంబ సంక్షేమాన్ని కూడా గుర్తుంచుకోవాలన్నారు. వాహన దారులతోపాటు ముఖ్యంగా విద్యార్థులు ఖచ్చితంగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. విద్యార్థులు ప్రమాదాల్లో మరణిస్తే ఆ కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఖచ్చితంగా హెల్మెట్‌ను వాడాలన్నారు. ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ నూర్జహాన్‌ పాల్గొన్నారు.

‘బ్రౌన్‌’కు పోటీ పరీక్షల పుస్తకాలు

కడప కల్చరల్‌ : సీపీ బ్రౌన్‌ స్మారక గ్రంథాలయానికి మరికొన్ని పుస్తకాలు చేరాయి. కడప నగరానికి చెందిన లింగాల కొండారెడ్డి జ్ఞాపకార్థం ఆయన మేనకోడలు సింగిరెడ్డి శ్రీలక్ష్మి, అమిరెడ్డి సుధాకర్‌రెడ్డి దంపతులు రూ. 9 వేల విలువైన పోటీ పరీక్షల నూతన పుస్తకాలను అందజేశారు. మంగళవారం గ్రంథాలయం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌ రెడ్డిని తమ కుమారుడు వంశీకృష్ణతో కలిసి ఇతర 50 పుస్తకాలను కూడా అందజేశారు. కార్యక్రమంలో బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్‌ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు రమేష్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్‌ అసిస్టెంట్‌ ఆర్‌.వెంకట రమణ, కథా రచయిత వేంపల్లె షరీఫ్‌, తెలుగు ఉపన్యాసకులు కైపా కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



సీజనల్‌ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ రమణారెడ్డి



వేంపల్లెలో సీజనల్‌ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ దేవి

పులివెందుల టౌన్‌ : సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్‌ కమిషనర్‌ రమణారెడ్డి తెలిపారు. స్టాప్‌ డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పార్నపల్లి రోడ్డులోని జయమ్మ కాంప్లెక్స్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ తా గునీరు, తినే పదార్థాలు వాటిపై తీసుకోవాల్సిన జా గ్రత్తల గురించి వివరించారు. ఈ వర్షా కాలంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్‌ వ్యాధుల భారిన పడకుండా ఉంటామని వివరించారు. చిరు వ్యాపారస్తులకు, హోటళ్ల యజమానులు ఆహార పదార్థాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ మురళీధర్‌, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ప్రిన్సిపాల్‌ యోగాంజనేయులు మాట్లాడారు. ప్రస్తుతం డయేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగిన సూచనలు, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాల శుభ్రత, ఆహార పరిశుభ్రత ఖచ్చితంగా పాటించాలని కోరారు. దీంతో ఆ వ్యాధులు దరిచేరకుండా నివారించవచ్చన్నారు.

అనంతరం సీహెచ్‌ఓ దేవి మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిలవడం ద్వారా దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులు సంభవిస్తాయన్నారు. అలాగే ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల శుభ్రత, ఆహార పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా కలిగి ఉండాలని, కా లుష్య రహిత నీటిని సేవించడంపై తగిన జాగ్రత్త చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మల్లేశ్వరమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఆల్ఫాసైపర్‌ మిత్రిన్‌ పిచికారీ చేయిస్తున్న మలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి సిద్ధయ్య

వేముల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి సిద్ధయ్య తెలిపారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం దోమల నివారణకు ఆల్ఫాసైపర్‌ మిత్రిన్‌ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు పూర్తి కావడం, పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు పునః ప్రారంభం కావడంతో ముందు జాగ్రత్త చర్యగా జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు పిచికారీ చేశామన్నారు. ఈ ఆల్ఫాసైపర్‌ మిత్రిన్‌ ద్రావణాన్ని పిచికారీ చేసిన 10 నుంచి 12 వారాల వరకు దోమలు వ్యాప్తి చెందకుండా నిరోధించవచ్చన్నారు. ఈ ద్రావణం పిచికారీ చేసిన ప్రదేశంలో దోమలు వాలితే నిమిషాల్లో చనిపోతాయన్నారు. మలేరియా నివారణకు విద్యార్థులు కూడా పరిశుభ్రత పాటించాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ శారద, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులను శుభ్రపరచండి



కార్యనిర్వహణ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : పట్టణంలో ఇటీవల జరిగిన రోడ్ల మరమ్మతుల కారణంగానో లేక మరో కారణంగానో పట్టణంలోని ప్రధాన రహదారులు కడప రోడ్డు, పులివెందుల రోడ్డు, గండిరోడ్డు, గాంధీ రోడ్లన్నీ దుమ్ము ధూళితో నిండిఉన్నాయని, ఆ రహదారులను తక్షణమే శుభ్రపరచాలని వేంపల్లె పంచాయతీ కార్యనిర్వహణ అధికారికి స్థానిక బీజేపీ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మా మాట్లాడుతూ వేంపల్లె ప్రధాన రహదారుల్లో ప్రతీరోజు వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నప్పుడు రహదారుల్లో ఉన్నటువంటి దుమ్ము గాలిలోకి లేచి ప్రజలకు చాలా అసౌకర్యంగా ఉందన్నారు. దయచేసి ఈ రహదారులలోని దుమ్మును శుభ్రపరిచి ప్రజలకు వెంటనే ఉపశమనం కలిగించాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు వీల్‌చైర్లు పంపిణీ



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేసిన చైతన్య మహిళా మండలి

వేంపల్లె : స్థానిక భవిత దివ్యాంగుల కేంద్రంలోని చిన్నారులకు వీల్‌ చైర్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం చైతన్య మహిళా మండలి దాదాపు రూ.2లక్షల విలువ చేసే 20 వీల్‌చైర్లు పంపిణీ చేసినట్లు ఐఈఆర్టీ యశోద వెల్లడించారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ఐఈ జిల్లా కోఆర్డినేటర్‌ కేశవరెడ్డి, ఎంఈఓలు జాఫర్‌, స్టాలిన్‌, పాస్టర్‌ స్టీఫెన్‌ పాల్‌, చిల్డ్రన్‌ హోం ప్రెసిడెంట్‌ మేరి ఎస్టేర్‌, రిటైర్డ్‌ వార్డెన్‌ నాగన్నలు హాజరై మాట్లాడారు. సమాజంలోని బడులు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, ప్రత్యేకంగా బాలబాలికలు, మహిళల అభివృద్ధి కోసం చైతన్య మహిళా మండలి కృషి చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉచితంగా టైలరింగ్‌ శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. అలాగే స్వయం ఉపాధి పనులు కల్పించి, అవకాశాలు ఇవ్వడం సంతోషకరమన్నారు. నీటి బోర్లు వేసి ప్రజల దాహార్తిని తీర్చడానికి చైతన్య మహిళా మండలి చేసే సేవలపై కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వరి, ఐఈఆర్టీ సుజాత, ఫిజియోథెరపిస్ట్‌ డా.ఆనంద్‌, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని శవాస్కన్‌పల్లె గ్రామంలో టీడీపీ నాయకులు దాడిచేసిన సంఘటనలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు చేసే దాడులకు అధైర్యపడవద్దు. పార్టీ, నేను మీకు అండగా ఉంటామని వారి భరోసా కలిగించారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామమోహన్‌రెడ్డి, హుస్సేన్‌, నాగసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అందరికి అందుబాటులో ఇసుక



ఉచిత ఇసుకను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రజలకు పారదర్శకంగా ఇసుకను అందించాలన్న లక్ష్యంతో తీసుకవచ్చిన నూతన ఇసుక విదానం ప్రజలందరికి తక్కువ ఖర్చుతో అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పగడాల పల్లె గ్రామ సమీపంలో ఉన్న ఇసుక స్టాక్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం లేకుండా ఉచితంగా ప్రజలందరికి ఇసుక అందుబాటులో ఉంచుతామన్నారు. ఉచిత ఇసుకను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ చంద్రశేఖర్‌ వర్మ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్‌ : నూతనంగా ఏర్పాటైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్‌ చేశాయి. ఈ మేరకు మంగళవారం కడపకు వచ్చేసిన రవాణశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆర్‌ అండ్‌ బి అతిథి గృహంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఎస్‌బిఐబి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌లు మాట్లాడుతూ కడప ఉక్కును నిర్మించడం వల్ల వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు.

జాతీయ పునర్నిర్మాణమే ధ్యేయం



శోభా యాత్ర చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కమలాపురం : జాతీయ పునర్నిర్మాణమే ధ్యేయంగా ఏబీవీపీ పనిచేస్తోందని ఆ శాఖ జిల్లా కన్వీనర్‌ మాణిక్యరాజు తెలిపారు. మంగళవారం ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలాపురం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. ఆటో స్టాండ్‌ నుంచి రైల్వే గేటు వరకు ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పునర్నిర్మాణమే ధ్యేయంగా ఏబీవీపీ పని చేస్తోందన్నారు. స్వామి వివేకానంద చెప్పినటువంటి మాటలే బాటగా ×విద్య జీవితం కోసం-జీవితం దేశం కోసం€ అంటూ గత 75 సంవత్సరాలుగా దేశంలోని విద్యార్థి లోకాన్ని ఏబీవీపీ అనే నాలుగు అక్షరాలు జాతీయ భావాలు కలిగినటు వంటి విద్యార్థులను తయారు చేస్తోందన్నారు. 1949 జూలై 9న ఢిల్లీలో ప్రారంభమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌కు ×భారత్‌ మాతాకి జై€ నినాదమే నిత్య ప్రేరణ అన్నారు. విద్యార్థులకు ఏ సమస్యలొచ్చినా తన దైన శైలిలో నిర్మాణాత్మక ఉద్యమాలు నిర్వహించి విద్యార్థుల శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా సమస్యలకు పరిష్కార మార్గం చూపిస్తూ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థ ఏబీవీపీ అని చెప్పడానికి గర్వపడుతున్నామన్నారు. కార్యక్రమంలో తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : పుట్టిన ప్రతి ఆడబిడ్డను సంరక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఆర్డీఓ శ్రీనివాస్‌ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సబ్‌ డిస్ట్రిక్ట్‌ లెవల్‌ మెంబర్స్‌ అథారిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సమాజంలో ఆడ, మగ ఇద్దరు సమానమే అన్న భావన ఉండాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేట్‌ ఆసుపత్రులు, స్కానింగ్‌ సెంటర్‌లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ప్రైవేట్‌ ఆసుపత్రుల్లో స్కానింగ్‌ చేసి లింగ నిర్ధారణ చేయడం చట్ట రీత్యానేరం అన్నారు. లింగ నిర్ధారణ చేసినట్లు రుజువు అయితే వాటిపై కేసులు పెట్టి మూయిస్తామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజేశ్వరి, సీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్‌ అధికారులు నిర్లక్ష్యం వీడాలి



మున్సిపల్‌ హెల్త్‌ ఆఫీసర్‌ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

కడప కార్పొరేషన్‌ : మున్సిపల్‌ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పీఎఫ్‌ కార్యాలయ అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ నగర అధ్యక్షుడు ఎస్‌. రవి పేర్కొన్నారు. మంగళవారం కార్మికులు మున్సిపల్‌ హెల్త్‌ ఆఫీసర్‌ డా. చంద్రశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పీఎఫ్‌ విషయంలో 7, 8 సంవత్సరాలుగా పుట్టిన తేదీ, తండ్రి పేరు ఇతరత్రా తప్పులు దొర్లిన వారు అవి మార్చుకోవడానికి వీలుగాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ తప్పులు సరిదిద్దడానికి పీఎఫ్‌ కార్యాలయంలో ఒక కంప్యూటర్‌ ఆపరేటర్‌ను ఏర్పాటుచేసి ఉన్నారని, ఆయనకు ఇచ్చినప్పటికీ లోపాలు సవరణ కాలేదన్నారు. పీఎఫ్‌ కార్యాలయంలో అసలు అధికారుల తీరు చాలా నిర్లక్ష్యంగా ఉందన్నారు. నగరపాలక కమిషనర్‌ జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలన్నారు.

టిప్పర్‌ బోల్తా.. డ్రైవర్‌ మృతి



మృతిచెందిన గంగాధర్‌



అదుపు తప్పి బోల్తా పడ్డ ముగ్గురాయి టిప్పర్‌

పెండ్లిమర్రి : కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని గుర్రాలచింతలపల్లె వద్ద మంగళవారం రాత్రి అదుపు తప్పి మిని టిప్పర్‌ బోల్తా పడ్డ సంఘటనలో వేముల గ్రామానికి చెందిన టిప్పర్‌ డ్రైవర్‌ గంగాధర్‌(21) అక్కడిక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వేముల నుండి ముగ్గురాయి లోడ్‌తో కడపకు వెలుతున్న మినిటిప్పర్‌ గుర్రాలచింతల పల్లె వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌ గంగాధర్‌ టిప్పర్‌ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని కడప రూరల్‌ సీఐ నాగరాజు పరిశీలించి క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటకు తీయించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వివేకానందుడి జీవిత సందేశ పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న చైర్మన్‌, ప్రధానోపాధ్యాయుడు

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం వివేకానందుడి బోధనలు-మానవతా విలువలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద ఫౌండేషన్‌ చైర్మన్‌ రామకృష్ణారెడ్డి 90 మంది 10వ తరగతి విద్యార్థులకు వివేకానందుడి జీవిత సందేశాల పుస్తకాలను పంపిణీ చేశారు. వివేకానందుడి బోధనలు, ఆశయాలు విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివేకానంద ఆశ్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు పద్మనాభరెడ్డి, కుండా భాస్కర్‌లు చెరో రూ.5వేలు విరాళంగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, ఉపాధ్యాయులు మాధవరెడ్డి, అన్వర్‌బాషా, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోండి



భవిత కేంద్రంలో పిల్లలకు ఇచ్చే ఫిజియోథెరిపీని పరిశీలిస్తున్న ఎంఈఓ శివప్రసాద్‌

ఎర్రగుంట్ల : పట్టణంలోని 2వ వార్డు స్కూల్‌లో ఉన్న భవిత కేంద్రంలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి శివప్రసాద్‌ తెలిపారు. మంగళవారం భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరంను ఆయన పరిశీలించి మాట్లాడారు. శారీరక వైకల్యం, మానసిక వైకల్యం ఉన్న దివ్యాంగులకు ప్రతి మంగళవారం భవిత కేంద్రంలో ఉచితంగా ఈ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ భవిత కేంద్రంలో పేర్లను నమోదు చేసుకున్న పిల్లలకు ఎస్కార్ట్‌, రవాణ, రీడర్‌ అలవెన్స్‌లు, బాలికలకు స్టైఫండ్‌, హోమ్‌ బెస్ట్‌ స్టైఫండ్‌ తదితర అలవెన్స్‌లు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, డాక్టర్‌ సతీష్‌కుమార్‌, ఐఈఆర్‌పీ రవికుమార్‌లు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానాలపై అవగాహన



ఇసుక విధానాలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్‌, సీఐలు

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఉచిత ఇసుక విధానాలపై వేంపల్లె తహసీల్దార్‌ వెంకటేష్‌, సీఐ చాంద్‌బాషాలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో ట్రాక్టర్‌ యజమానులు, రైతులకు వారు నూతన మార్గదర్శకాలను వివరించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా, నిర్వహణ ఛార్జీలు మాత్రమే వినియోగదారులకు ఇసుకను సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇసుక కావాల్సిన వారు స్టాక్‌ పాయింట్ల వద్ద ఇసుక ట్రాన్సిస్ట్‌ ఫారంలో వివరాలతో తమ ఆధార్‌కార్డు నెంబరు నమోదు చేసి బుక్‌ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 11 స్టాక్‌ పాయింట్లు ఉండగా.. వేంపల్లెకు సమీపంలోని వీరపునాయునిపల్లె, పులివెందులలో ఇసుక స్టాక్‌ పాయింట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించి స్టాక్‌ పాయింట్ల నుంచే ఇసుకను తోలుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎద్దుల బండ్లకు మినహాయింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్‌ అధికారి సోమశేఖర్‌ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ లోకేష్‌, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రజక ఐక్యవేదిక ఆత్మీయ సమావేశం

కడప కార్పొరేషన్‌ : జిల్లా రజకుల ఐక్యవేదిక ఆత్మీయ సమావేశం పొలతలలోని బండెన్న స్వామి సన్నిధిలో మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు ఆ వేదిక అధ్యక్షుడు టి. నాగేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఓ. కేశవయ్య, ఉపాధ్యక్షులు గంగులయ్య, ఎల్‌. సుబ్బరాయుడు, పెద్దరోశన్నలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమావేశంలో జిల్లా నలుమూలల నుంచి రజక సోదరులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారన్నారు. రజకుల సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించామన్నారు.

బాలికా.. యువ సైనిక..!

- కేజీబీవీల్లో ఎన్‌సీసీ యూనిట్లు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్‌
- జిల్లా వ్యాప్తంగా 17 కేజీబీవీలు, 3 మోడల్‌ స్కూల్స్‌
- ప్రాధాన్యత క్రమంలో కేటాయింపులు



ఎన్‌సీసీ కేడెట్స్‌

వైవీయూ : విద్యార్థిదశ నుంచే విద్యార్థుల్లో జాతీయ సమైక్యత, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెంపొందించడమే ధ్యేయంగా ఏర్పాటైన నేషనల్‌ కేడెట్‌ కార్ప్స్‌ (ఎన్‌సీసీ) సేవలు విస్తరించనున్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు దేశవ్యాప్తంగా దాదాపు 3 లక్షల మంది నూతన ఎన్‌సీసీ కేడెట్స్‌ నియామకాల ప్రక్రియ చేపట్టాలని మార్గదర్శకాలు జారీ చేశారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 42 పాఠశాలలు, 3 మోడల్‌ స్కూల్స్‌లో సైతం ఎన్‌సీసీ యూనిట్లు ప్రాధాన్యత క్రమంలో ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

తాజాగా సమగ్రశిక్షా అభియాన్‌ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ఎన్‌సీసీ ప్రారంభించి ప్రవేశాలు చేపట్టాలని సమగ్రశిక్షా అభియాన్‌ ప్రాజెక్టు డైరెక్టర్‌ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా జిల్లా వ్యాప్తంగా 30 ఆంధ్రా బెటాలియన్‌ పరిధిలో జూనియర్‌ డివిజన్‌ ఎన్‌సీసీ యూనిట్లు 13 ఉండగా, కేజీబీవీల్లో సైతం ఎన్‌సీసీ ప్రారంభిస్తే మరింత విస్తరించే అవకాశం కలుగుతుంది. జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలు ఉండగా, జిల్లా విద్యాశాఖాధికారి/సమగ్రశిక్షా అభియాన్‌ అడిషనల్‌ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు సమీపంలోని ఎన్‌సీసీ బెటాలియన్‌లో సంబంధిత ఎన్‌సీసీ అధికారులను కలిసి కేజీబీవీల్లో ప్రాధాన్యత క్రమంలో ఎన్‌సీసీ యూనిట్లు ఏర్పాటు చేసి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించేలా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులు ఎన్‌సీసీలో చేరే అవకాశం లభించనుంది.